క్లుప్తంగా

ఘనంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ



దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న యనమల కృష్ణుడు

తొండంగి: గోపాలపట్నం గ్రామ శివారులో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. సర్పంచ్ కటకం శివ కుటుంబం ఆధ్వర్యంలో నూతన ఆలయాన్ని నిర్మించారు. శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా బుధవారం దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గంట చక్రరావు, గాబు రాజు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలేశ్వరం: ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన ప్రభుత్వ, ప్రభుత్వేతర ఆర్థిక సాయం దొరకని విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రతిభ స్కాలర్‌షిప్ ట్రస్టు కార్యదర్శి ఎండీ ఇబ్రహీం ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 2024–25 ఏడాదికి గాను ఐఐటీ, నీట్, జేఈఈ, మెడిసిన్, ఇంజినీరింగ్‌ల్లో చేరుటకు ఎంసెట్‌లో పది వేలలోపు ర్యాంక్ సాధించి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తులను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ప్రతిభస్కాలర్‌షిప్.కామ్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను వచ్చే నెల 11లోగా వరుపుల చిట్టిబాబు, శ్రీగణపతి వెంకటసాయి బ్యాంకర్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా, ఏలేశ్వరం –533429 చిరునామాకు పంపాలని తెలిపారు.

టెట్‌కు 406 మంది హాజరు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఐదు రోజులుగా జరుగుతున్న ఏపీ టెట్–2024 ఆన్‌లైన్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్టు డిప్యూటీ చాన్సలర్ ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 406 మంది అభ్యర్థులు హాజరు కాగా, 37 మంది గైర్హాజరైనట్టు చెప్పారు.

పోలీసుల ప్రత్యేక నిఘా

జగ్గంపేట: మండలంలో జూదాలు నిర్వహిస్తున్న పలు ప్రాంతాలను పరిశీలించినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. పలు గ్రామాల్లోని రహస్య ప్రదేశాల్లో పేకాట, గుండాట, కోడిపందాలు తదితర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందిందని చెప్పారు. ఈ నేపథ్యంలో మండలంలో జూదాలకు నిలయాలుగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎస్సై రఘునందనరావు, సిబ్బంది ఉన్నారు.

దేశ ఖ్యాతిని ఇనుమడింపజేయాలి



విజేత ప్రకాశరావు, కోచ్ రత్నాకర్‌రావును సత్కరిస్తున్న ప్రతినిధులు

తుని: ప్రపంచ దేశాల్లో భారత ఖ్యాతిని ఇనుమడింపజేయాలని అలయెన్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కొత్తపేట సీతారామ యోగా భవనంలో అలయెన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు కె.భీమరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం జిల్లాకు చెందిన ఇంటర్నేషనల్ తైక్వాండో పోటీలో బంగారు పతకం సాధించిన మలపర్తి ప్రకాశరావు, కోచ్ పి.రత్నాకర్‌రావును ఘనంగా సత్కరించారు. దేశ ప్రతిష్టను ఇనుమడించిన వీరిని యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు సూచించారు. క్లబ్ ప్రతినిధులు ఆంజనేయ ప్రసాద్, నూకయ్యశెట్టి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు ఉపకరణాలను ఇస్తున్న ఎమ్మెల్యే


తుని: అంగవైకల్యం శరీరానికే కానీ, మనసుకు కాదని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక రాజా కళాశాల మైదానంలో అలిమ్కో సంస్థ సమకూర్చిన 343 ఉపకరణాలను ఆమె దివ్యాంగులకు అందజేశారు. దివ్యాంగులకు బ్యాటరీ, సాధారణ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, కృత్రిమ కాళ్లు వంటి ఉపకరణాలను అందజేశామని సంస్థ ప్రతినిధి రవిశంకర్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ కుసుమంచి శోభారాణి పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: రాజవరం కొండగెడ్డ వద్ద సారా తయారు చేస్తున్న వాసంశెట్టి శ్రీనివాస్‌ను బుధవారం అరెస్ట్ చేసినట్టు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. అతని వద్ద 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.


అరణ్యంలో మృత్యు క్రీడ

- విచ్చలవిడిగా వన్య ప్రాణుల వేట
- మూగజీవాలే లక్ష్యంగా కరెంటు తీగలతో ఉచ్చులు
- వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్న అమాయక జనం
- గ్రామాల్లో జోరుగా మాంస విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు





వన్య ప్రాణులను హతమార్చేందుకు వినియోగిస్తున్న ఇనుప వైర్లు



పాదురుపాకలో వన్య ప్రాణులను మట్టుబెట్టేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు

వన్య ప్రాణుల సంరక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, అడవుల్లో జంతువుల వేట మాత్రం ఆగడం లేదు. కాసుల కోసం కరెంట్ షాక్ పెట్టి జంతువులను మట్టు పెడుతున్నారు వేటగాళ్లు. ఈ క్రమంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు అమాయక జనం బలవుతున్నారు.

ప్రత్తిపాడు రూరల్: ఏలేశ్వరం ఫారెస్టు రేంజ్ పరిధిలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలున్నాయి. ఆయా మండలాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో వన్య ప్రాణులకు రక్షణ లేకుండా పోతోంది. ఇక్కడ వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతున్నా, అటవీ శాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో కొంత మంది వన్యప్రాణుల వేటను ప్రధాన వృత్తిగా ఎంచుకున్నారు. అటవీ ప్రాంతంలో జంతువులను వేటాడి గ్రామాల్లో విచ్చలవిడిగా వాటి మాంస విక్రయాలు సాగిస్తున్నారు.

విద్యుత్ తీగలతో..

ఏలేశ్వరం ఫారెస్టు రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో జంతువులు ప్రధానంగా వేటగాళ్ల ఉచ్చులో పడి చనిపోతున్నాయి. ఎక్కువగా జంతువులు సంచరించే ప్రదేశాలతో పాటు, పొలాల్లో రాత్రి సమయాల్లో విద్యుత్ తీగలు అమర్చుతున్నారు. చాలా జంతువులు దప్పిక తీర్చుకోవడానికి జనావాసాల్లోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి అడవి పందులు, కొండ గొర్రెలు, దుప్పులు, కుందేళ్లు వంటివి ప్రాణులు చనిపోతున్నాయి.

వేట మాంసం విక్రయాలు

వన్యప్రాణుల వేటే ప్రధాన వృత్తిగా ఎంచుకున్న కొందరు వ్యాపారులు పలు గ్రామాల్లో యథేచ్ఛగా వేట మాంసం విక్రయాలు జరుపుతున్నారు. వన్య ప్రాణుల మాంసానికి అధిక ధర ఉండడంతో, చాలా మంది ఈ వృత్తినే జీవనాధారంగా చేసుకున్నారు. ఉచ్చులో పడ్డ జంతువులను వధించి, కిలో రూ.700 నుంచి రూ.వెయ్యి వరకూ విక్రయిస్తున్నారు. దీంతో ఒక్కో జంతువుపై రూ.50 వేలకు పైనే ఆదాయం వస్తున్నట్టు తెలిసింది.

ఉచ్చులకు అమాయకుల బలి

జంతువుల కోసం వేటగాళ్లు అమర్చిన ఉచ్చులకు అమాయకులు బలవుతున్నారు. తాజాగా వై.రామవరం మండలం డొంకరాయి పోలీసు స్టేషన్ పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా, సీఆర్పీఎఫ్ ఏఎస్సై తిరునావ్ అరసు మెట్టగూడెం శివారు ప్రాంతంలో అడవి జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందారు. గతంలో ప్రత్తిపాడు మండలం పోతులూరులో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి మర్రి తలుపులయ్య మృతి చెందాడు. అలాగే మండలంలో పెద్దిపాలెం, దారపల్లి గ్రామాల్లో విద్యుత్ తీగలు తగిలి అమాయకులు మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి. పలు గ్రామాల్లో వేటగాళ్లు అమర్చుకుతున్న విద్యుత్ తీగలకు తరచూ పాడి పశువులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో అటవీ ప్రాంతంలోకి వ్యవసాయ పనులకు వెళ్లేందుకు రైతులు, కూలీలు జంకుతున్నారు. ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు వేటగాళ్లపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వన్య ప్రాణుల వేటను అరికట్టి, అమాయకుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వన్య ప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. వన్య ప్రాణుల వేట నిషేధంపై ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యుత్ తీగలు అమర్చే ప్రాంతాలను గుర్తించాం. వీటిపై ప్రత్యేక నిఘా ఉంచాం. శంఖవరం మండలం గౌరింపేటలో తాజాగా రెండు కి.మీ. మేర అమర్చిన విద్యుత్ వైర్లను తొలగించాం. వన్య ప్రాణుల సంరక్షణపై క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్షించి నివారణ చర్యలు చేపడుతున్నాం. ఎవరైనా అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– కె.దుర్గా రాంప్రసాద్, అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్, ఏలేశ్వరం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

– బాణసంచా కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎస్పీ



కాకరాపల్లిలో బాణసంచా విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

కోటనందూరు: బాణసంచా విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు హెచ్చరించారు. కాకరాపల్లిలో నిర్వహిస్తున్న బాణసంచా విక్రయ కేంద్రాన్ని బుధవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. అక్కడ విక్రయానికి ఉంచిన టపాసులను పరిశీలించారు. బాణసంచా విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విక్రయ కేంద్రం వద్ద ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరిగినా నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎస్సై టి.రామకృష్ణ ఉన్నారు.

మద్యం షాపులకు 214 దరఖాస్తులు

- 11 వరకూ గడువు పొడిగింపు

ప్రత్తిపాడు: కొత్తగా ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. 14వ తేదీన కాకినాడలో లాటరీ ద్వారా మద్యం షాపులకు దరఖాస్తుదారుల ఎంపిక జరుగుతుందన్నారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలంలో రెండు, ప్రత్తిపాడు మండలంలో మూడు, ఏలేశ్వరం నగర పంచాయతీలో మూడు, రూరల్ పరిధిలో మూడు, శంఖవరం మండలంలో నాలుగు వెరసి 15 మద్యం షాపులున్నాయి. బుధవారం సాయంత్రానికి 214 దరఖాస్తులు దాఖలైనట్టు ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు.

విధుల్లో చేరికపై 14న వలంటీర్ల ధర్నా



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన వలంటీర్లు

ప్రత్తిపాడు: గ్రామ, వార్డు వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలంటూ ఈ నెల 14న ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్టు సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల వలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఈశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో కూటమి అగ్ర నేతలు వలంటీర్లకు ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ సమావేశంలో వలంటీర్లపై సానుకూలమైన చర్చలు జరిపి, న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో వలంటీర్లు రోడ్లపైకి వచ్చి, పెద్దఎత్తున నిరసనలు చేపట్టనున్నారని హెచ్చరించారు. అంతేగాక తొలగించిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, బకాయి వేతనాలను విడుదల చేయాలని కోరారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వలంటీర్ల సంఘ ప్రతినిధులు ఎస్ జాకబ్, కె.రాజేష్, ఎం.అనిత, వై.నాగమణి, జి.శ్యామల, జి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ

గండేపల్లి: రామ్‌కో కంపెనీ ఆధ్వర్యంలో గండేపల్లిలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. శరన్నవరాత్రుల్లో భాగంగా ఆరో రోజు బుధవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతి, కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం డీలర్ బొల్లంరెడ్డి రామకృష్ణ విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు.

గుబ్బాలమ్మ ఆలయంలో చండీ యాగం



గుబ్బాలమ్మ ఆలయంలో చండీ యాగం చేస్తున్న పండితులు

గండేపల్లి: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని మురారిలో గ్రామ దేవత గుబ్బాలమ్మ వారి ఆలయంలో బుధవారం చండీ యాగం నిర్వహించారు. ఉప సర్పంచ్ జాస్తి వసంత్, లక్ష్మి శ్రీదుర్గ దంపతులతో పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు. పరిసర గ్రామాల నుంచి కూడా భక్తులు హాజరయ్యారు.

రేపు డయల్ యువర్ డీఎం

తుని: ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు శుక్రవారం ఉదయం 11 గంటలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని మేనేజరు కిరణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తుని, పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ సేవలపై తమ అభిప్రాయాలను 73827 81490 సెల్ నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

రాగి పంటతో రైతులకు మేలు



కేఈ చిన్నయ్యపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ చంద్రశేఖర్

శంఖవరం: పకృతి వ్యవసాయం ద్వారా రాగి పంట పండించడం ద్వారా రైతులు అధిక లాభాలను పొందవచ్చని పకృతి వ్యవసాయం స్టేట్ రిసోర్స్ పర్సన్ దేవుళ్లు అన్నారు. బుధవారం మండలంలోని వి.వెంకటాపురం గ్రామంలో రాగి, పామాయిల్, కూరగాయల పంటలు మిర్చి, వంగ, టమాట, చిక్కుడు తదితర పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ఉద్యాన పంటలలో అంతర పంటలుగా రాగి సాగు చేయడం ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి, జీవామృతం ఎక్కువగా వాడాలన్నారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా ఉండడంతో కూరగాయల పంట మధ్య నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉద్యాన అధికారి పి.అరుణ్‌కుమార్, సహాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో సత్ఫలితాలు

కోటనందూరు: వరి సాగులో ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అన్నారు. కేఈ చిన్నయ్యపాలెంలో పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ, వరి సాగులో నేల స్వభావాన్ని బట్టి ఎరువులు, తెగుళ్లను బట్టి పురుగు మందులు వినియోగించాలన్నారు. పొలాలను పరిశీలించి, ఎరువులు, పురుగు మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. తాండవ ఏఈఓ దుర్గబాబు, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ముసలయ్య, ఏఈఓ కేవీ శివకుమారి పాల్గొన్నారు.

రౌతులపూడి: ఖరీఫ్ రైతులంతా సాగులో మెళకువలు పాటించాలని ఏఓ రెడ్డి ఈశ్వరరావు అన్నారు. బుధవారం ఎస్ఎస్ పట్నం, లచ్చిరెడ్డిపాలెం, బీబీ పట్నం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి పి.అరుణ్‌కుమార్, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు

తుని రూరల్: మెట్ట ఖరీఫ్ వరికి సోకే తెగుళ్లను సకాలంలో నివారిస్తే అధిక దిగుబడులు లభిస్తాయని ఏఓ బి.అశోక్‌కుమార్ అన్నారు. తుని మండలం కొలిమేరు, కుమ్మరిలోవ గ్రామాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో వరికి ఎండు తెగులు సోకే అవకాశాలు ఉన్నాయన్నారు. సకాలంలో తెగులు గుర్తించి నివారించాలన్నారు. ఆయిల్ పామ్ తోటలలో అంతర పంటగా అరటి, తైవాన్ జామ సాగు చేయాలని ఉద్యాన అధికారి జి.వి జయలక్ష్మి సూచించారు.

కేంద్ర బృందం పర్యటన



మామిడాడలో చెరువు పనులను పరిశీలిస్తున్న సభ్యులు

జగ్గంపేట: కేంద్ర నిధులతో మూడు గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులను నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం బుధవారం పరిశీలించింది. రామవరం, కాండ్రేగుల, మామిడాడ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్, హౌసింగ్, పెన్షన్స్, డీఆర్‌డీఏ ద్వారా జరిగిన పలు పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ బృందంలో టీవీ తిలకన్, పీఆర్ సాల్మన్ ఉన్నారు.

గుర్రంపాలెంలో అమ్మవారికి బోనాలు



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న దుర్గా అమ్మవారికి 108 మంది మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. దసరా ఉత్సవాలలో భాగంగా స్థానిక గురుదత్త శిరిడీ సాయి వీరాంజనేయ సహిత విఘ్నేశ్వరస్వామి దేవాలయం నుంచి 108 మహిళలు బోనాలు ఎత్తుకుని గ్రామంలో భవానీ భక్తులతో కలిసి భారీ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో గ్రామం మార్మోగింది. చివరగా దేవి ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయాలు కొనసాగించాలి



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఏలేశ్వరం: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఆశయాలను కొనసాగించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక దిబ్బలపాలెంలోని గ్రంథాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, వాగు రాజేష్, బుగతా శ్రీను, కోరాడ కృష్ణమోహన్, సామంతుల రాంబాబు, మామిడి లలిత తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లిగా.. కల్పవల్లిగా..

- సరస్వతీదేవి అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు



మర్రిపాకలో చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న సీడీపీఓ



కిర్లంపూడి వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం సందర్భంగా బుధవారం అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ, పెన్నులకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు కార్య నిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. పూజలో ఉంచిన పెన్నులను అమ్మవారిని దర్శించుకున్న విద్యార్థులకు, భక్తులకు పంపిణీ చేసినట్టు చెప్పారు.

కాకరాపల్లిలో కనకదుర్గమ్మ

కోటనందూరు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా కాకరాపల్లి కనకదుర్గమ్మ భక్తులకు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. వేద పండితుడు జయంతి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి, చిన్నారులతో పూజలు చేయించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

కిర్లంపూడి: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వందల సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. జగపతినగరం అభయ దుర్గమ్మ, రామచంద్రపురం కనకదుర్గమ్మ అమ్మవార్లను సరస్వతీదేవి అవతారంలో సుందరంగా అలకంరించారు.

జగ్గంపేటలో భువనేశ్వరీదేవి

జగ్గంపేట: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవి సెంటర్‌లోని భువనేశ్వరిదేవి ఆలయంలో సరస్వతీదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అక్షరాభ్యాసం కార్యక్రమాలు జరిగాయి. మామిళ్ల పల్లి అయ్యప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏలేశ్వరం: శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా సరస్వతీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాల వద్ద తల్లిదండ్రులు వారి పిల్లలతో కలిసి సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయం వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో నేరేళ్లమ్మ అమ్మవారు

తొండంగి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గోపాలపట్నంలో నేరేళ్లమ్మ అమ్మవారు భక్తులకు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అన్నవరం గ్రామానికి చెందిన దామెర కృష్ణారావు దంపతులు సరస్వతీదేవి అలంకరణలకు దాతలుగా సహకరించారు. అర్చకులు అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, భవానీదీక్షాపరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గోకవరం: పవిత్ర శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ బుధవారం శ్రీసరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక సరస్వతీదేవి పూజలు జరిపారు. 300 మంది చిన్నారులు పాల్గొన్నారు.

మర్రిపాకలో బొమ్మల కొలువు

జగ్గంపేట: మండలంలోని మర్రిపాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసాలు, బొమ్మల కొలువు, తల్లులతో బతుకమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా బొమ్మల కొలువు, చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించామన్నారు.

శంఖవరం: దేవీ నవరాత్రుల సందర్భంగా పలు గ్రామాల్లో దుర్గమ్మ అమ్మవారు బుధవారం భక్తులకు సరస్వతీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. గ్రామ పురవీధుల నుండి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయప్రాంగణంలో కుంకుమ పూజలు నిర్వహించారు. సీతంపేటలో దుర్గా మీనాక్షి అమ్మవారిని భక్తులు పట్టు వస్త్రాలతో అలంకరించారు.



జగ్గంపేటలో సరస్వతీదేవిగా భువనేశ్వరీదేవి



సరస్వతీదేవి అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు



రామచంద్రపురం కనకదుర్గమ్మ అమ్మవారు



ఏలేశ్వరంలో సరస్వతీదేవిగా దుర్గాదేవి అమ్మవారు



సీతంపేటలో పట్టు వస్త్రాల్లో దుర్గా మీనాక్షి అమ్మవారు

నాగభూషణాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రత్తిపాడు: ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలకు పోరాట స్ఫూర్తినిచ్చిన నాగభూషణం పట్నాయక్ వారసత్వాన్ని కొనసాగించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు లిబరేషన్ కార్యాలయంలో ఆంధ్రా–ఒడిశాలో గ్రామీణ పేదల ఉద్యమ రూపకర్త నాగభూషణం పట్నాయక్ వర్ధంతి సభ జరిగింది. ఉద్యమాలే ఊపిరిగా, తుది శ్వాస వరకు పోరాడారని వక్తలు కొనియాడారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రత్తిపాడు: గర్భిణులకు లయన్స్ క్లబ్ సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనిదని ప్రత్తిపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌమ్య అభినందించారు. స్థానిక సీహెచ్‌సీకి వచ్చిన 60 మంది గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు.

రౌతులపూడి: స్థానిక సీహెచ్‌సీలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రధాన వైద్యాధికారి జానకీదేవి ఆధ్వర్యంలో 160 మందిని పరీక్షించి, మందులు అందజేశారు.

పోలవరం నిర్వాసితుల నిరసన

గోకవరం: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ దేవీపట్నం మండలంలోని పోలవరం నిర్వాసితులు గోకవరంలో బుధవారం నిరసన చేపట్టారు. కృష్ణునిపాలెం పంచాయతీలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నుంచి నిర్వాసితులు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి, వినతిపత్రం అందజేశారు. కాలనీ జంక్షన్‌కు చేరుకుని ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.

మెరుగైన సేవలందించండి

ప్రత్తిపాడు రూరల్: ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎస్ఐఆర్‌డీ కన్సల్టెంట్ ఎస్ శ్రీనివాసరావు అన్నారు. ధర్మవరం పంచాయతీని ఆయన సందర్శించారు. జీపీడీపీ యాక్షన్ ప్లాన్ 2024–25 రికార్డులను పరిశీలించారు. సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, కార్యదర్శి కామరాజు ఉన్నారు.